క్లుప్తంగా

ప్లాక్లెయినర్ పట్టివేత

తానూరు: మండలంలోని కోలూరు శివారులో అనుమతి లేకుండా గుట్టను తవ్వుతున్న ప్లాక్లెయినర్‌ను శుక్రవారం తహసీల్దార్ లింగమూర్తి, ఎస్సై రమేశ్ పట్టుకున్నారు. రైతు వేదిక సమీపంలో ప్రభుత్వ భూమిలో మొరం తవ్వుతున్నారనే సమాచారం తెలుసుకున్న తహసీల్దార్, ఎస్సై.. ఆర్ఐ మోహన్‌సింగ్ ,రెవెన్యూ సిబ్బందితో అక్కడికి వెళ్లి ప్లాక్లెయినర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం యజమానికి రూ.10వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ సూచించారు.

యోగా సాధనతో ఆరోగ్యం

కుంటాల: ప్రతి ఒక్కరూ యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని యోగా శిక్షకురాలు మౌనిక పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగా సాధనలో మెలకువలు నేర్పించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి ఉదయపు నడక, యోగా అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజబాపు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

నర్సాపూర్(జి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ప్రజాపాలన, ప్రజావిజయోత్సవ వేడుకలను శుక్రవారం మండలకేంద్రంతోపాటు రాంపూర్, టెంబుర్ని గ్రామాల్లో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజలకు పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాథోడ్ కైలాస్, నవనీత్‌కుమార్, శైలజ, కళాకారులు సుదర్శన్, సుధాకర్, రఘు, జితేందర్, నాగరాజు, తస్లీమా, మాధవి తదితరులున్నారు.

సప్తాహం ప్రారంభం



కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

కుభీర్: మండలకేంద్రంలో విఠలేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తాళసప్తాహం ప్రారంభమైంది. ఏడు రోజులపాటు సాగే కార్యక్రమంలో భాగంగా 29న భారీజాతర జరగనుంది. ఈవారం మందిరంలో ఆర్యవైశ్యులు అన్నదానం చేస్తారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ పెంటాజీ, యాదవ సంఘం అధ్యక్షుడు ఉప్ప దత్తాత్రి, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు అరవింద్ ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

మహిళలకు శిక్షణ తరగతులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో ఈడీఐఐ యాక్సెంచర్ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఎంపీడీవో రాధ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సంస్థ 26 రోజులపాటు వివిధ అంశాలల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మహేశ్వర్ రెడ్డి, ఏపీఎం వాణిశ్రీ, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, మాస్టర్ ట్రైనర్ అలేఖ్య, రవి, దేవేందర్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న మెడిసమ్మె రాజు

లక్ష్మణచాంద: బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంతోపాటు చింతల్‌చాంద, పార్‌పెల్లి గ్రామాల్లో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసగించి గద్దనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి ఒక్కటి కూడా అమలు చేయకపోవడం సిగ్గు చేటని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ నయన్, మండల ఇన్‌చార్జి అడ్వాల రమేశ్, మండలాధ్యక్షుడు పాలాస గోవర్ధన్, మంతెన చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

సోన్: మండలంలోని సిద్దులకుంటకు చెందిన మనుష అనే యువతి అదృశ్యం కాగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు. సిద్దులకుంట చెందిన కాల నడిపిమల్లు–లక్ష్మి దంపతుల కుమార్తె మనూష ఈనెల 12న నిజామాబాద్ జిల్లా బోధన్‌లో కళాశాల నుంచి సర్టిఫికెట్లు తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. కళాశాలకు ఫోన్ చేస్తే రాలేదని సమాచారమిచ్చినట్లు కుటుంసభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం యువతి తల్లి ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీటికుంటలతో లాభాలెన్నో..

- పెరగనున్న భూగర్భజలాలు, నీటినిల్వ
- గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఈజీఎస్ అధికారులు



జౌలా(కే)లో అవగాహన కల్పిస్తున్న ఈజీఎస్ ఏపీవో గంగాధర్



హిప్నెల్లిలో నీటికుంట కొలతలు తీసుకుంటున్న అధికారులు

తానూరు: వర్షపునీటిని ఒడిసి పట్టేందుకు ఉపాధిహామీ పథకం కింద కమ్యూనిటీ ఫారంపాండ్స్(నీటికుంటలు) నిర్మాణం చేపడుతున్నారు. ఈ కుంటల ఏర్పాటుతో నీటినిల్వలు పెరిగి భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. వరద నిల్వ ఉండటంతో భూసారం దెబ్బతినకుండా ఉంటుంది. ఈనేపథ్యంలో తమ పంట పొలాల్లో నీటికుంటలు నిర్మించుకునేలా సంబంధిత అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే దీనిపై గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తూ.. అవగాహన కల్పిస్తున్నారు.

ప్రయోజనాలివీ..

రైతులు తమ పంట పొలాల వద్దే నిర్మించుకునే చిన్న మడుగులను కుంటలు అంటారు. ఈ కుంటల ఏర్పాటుతో కొంత భూమి పోయినా భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. వర్షాభావ పరిస్థితుల్లోనూ సాగు నీటికి ఢోకా ఉండదు. వీటి నిర్మాణంతో బోరుబావుల్లో నీరు నిల్వ ఉంటుంది. భారీవర్షాలకు భూమి కోతకు గురవకుండా ఉంటుంది. ఎగువ ప్రాంతం నుంచి నీటితో వచ్చిన మట్టి గుంతలో చేరుతోంది. ఈ మట్టి పొలాలకు ఎరువులా ఉపయోగపడుతోంది. ఏటా కుంటలో నుంచి మట్టిని తీసి పొలాల్లో వేసుకోవచ్చు. దీంతో పంట దిగుబడులు మరింత పెరుగుతాయి. బోరుబావుల నుంచి కొద్దిపాటి నీరు వచ్చినా కుంటలు నింపుకొని ఒకేసారి పంటలకు నీటితడులు అందించే వీలుంటుంది. దీంతో ఎకరం పొలానికి అవసరమయ్యే నీటితో రెండెకరాల పొలం సాగు చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

తానూరు మండలంలో..

పొలాల్లో నీటికుంటలు నిర్మించుకోవాలని ఈజీఎస్ సిబ్బంది గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో మండలంలో 25 మంది రైతులు దరఖాస్తులు చేసుకోగా అందులో 14 పూర్తయ్యాయి. మిగతా 11 నిర్మాణదశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. రైతులకు దీనిపై అవగాహన లేకనే రైతులు ఫారంపాండ్ నిర్మించుకునేందుకు ముందుకు రావడం లేదన్నారు. గ్రామాల్లో వంద శాతం ఫారం పాండ్స్ నిర్మించుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నయా పైసా ఖర్చులేకుండా ...

ఈజీఎస్ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడంతో నీటికుంటల నిర్మాణానికి రైతులు పైసా ఖర్చు చేయాల్సిన పనిలేదు. ఉపాధిహామీ పథకం కింద కూలీలే దీనిని నిర్మిస్తారు. రైతులు వర్షపునీటిని పొలంలో ఎక్కడ నిల్వ చేసుకోవాలో గుర్తించాలి. అనుకూలంగా ఉండే పల్లపు ప్రాంతంలో నీటికుంటను నిర్మించుకోవాలి. ఉపాధి సిబ్బంది ఇచ్చే కొలతల ప్రకారం నీటికుంట తవ్వాలి. 10 మీటర్ల పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతు తవ్వి కుంటను నిర్మించాలి. ఈ కుంట నిర్మిస్తే రూ.25 వేల వరకు చెల్లిస్తారని ఉపాధిహామీ సిబ్బంది తెలిపారు.



ఎల్విలో కుంటలో చేరుతున్న బోరు నీరు

సద్వినియోగం చేసుకోవాలి



రెండేళ్ల కిందట మా వ్యవసాయ భూమిలో నీటికుంటను ఏర్పాటు చేసుకున్నాం. బోరునీటిని కుంటలో నింపుకొని పంటలకు నీటిని అందిస్తున్నాం. నీటి కుంటతో లాభాలున్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– అసం ధర్మన్న, ఎల్వి

అవగాహన కల్పిస్తున్నాం

చేన్ల వద్ద కుంటలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కుంట ఏర్పాటు చేస్తే భూమి పోతుందని రైతులు ముందుకు రావడం లేదు. కుంటతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నాం.

– గంగాధర్, ఈజీఎస్ ఏపీవో

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్.. అధికారులకు సూచించారు. నిర్మల్‌రూరల్ మండలంలోని వెంగ్వపేట్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న రైతులను పలకరించి.. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని ఆరా తీశారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి.. మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ వెంటవెంట జరిగేలా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రత్న కల్యాణి, డీఎస్ఓ కిరణ్‌కుమార్, డీఎం గోపాల్, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, రూరల్ తహసీల్దార్ సంతోష్ తదితరులు ఉన్నారు.

కోతలు విధిస్తే చర్యలు..

కడెం: నిబంధనలకు విరుద్ధంగా రైతులు తెచ్చిన ధాన్యంలో కోతలు విధిస్తే చర్యలు తప్పవని.. సివిల్ సప్లయి డీఎం గోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇటీవల రైస్‌మిల్లర్ లారీలో పది బస్తాలు కోత విధించారని డీఎంతో రైతులు వాపోయారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధా న్యం తూకం వేశాక రైతులు రశీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు దుల్లె వెంకటేశ్, భీమన్న, చిన్నరాజన్న, బుచ్చన్న, రాజలింగు తదితరులున్నారు.



కడెం: కొత్తమద్దిపడగలో రైతులతో మాట్లాడుతున్న డీఎం గోపాల్

తప్పుల్లేకుండా డాటాఎంట్రీ పూర్తిచేయాలి

లక్ష్మణచాంద: తప్పుల్లేకుండా డాటాఎంట్రీని పూర్తి చేయాలని సీపీవో జీవరత్నం పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటింటి సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎక్కువ మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించుకొని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. తప్పులు లేకుండా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్, సిబ్బంది తదితరులున్నారు.

కుంటాల: ప్రభుత్వం చేపడుతున్న సర్వే వివరాలను కంప్యూటర్ ఆపరేటర్లు జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన సర్వేపై మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, పలువురు ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద: పరిశీలిస్తున్న సీపీవో జీవరత్నం

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు..

లోకేశ్వరం: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసే తీరును పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కంప్యూటర్ ఆపరేటర్లు.. ఆన్‌లైన్ తప్పులు నమోదు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమేశ్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ లలిత ఉన్నారు.



కుంటాల : మాట్లాడుతున్న అహ్మద్‌ఖాన్

‘మాలలకు న్యాయం జరిగే వరకు పోరాటం’

కుంటాల: మాలలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్ పేర్కొన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన సింహగర్జన పోస్టర్ శుక్రవారం మండలంలోని లింబా(కె), అంబకంటి గ్రామాల్లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాలూకా ఉపాధ్యక్షుడు దేవిదాస్ అనడే, మండల కన్వీనర్ సాయి, కాంతారావు, సభ్యులు రాజు, గంగాధర్, ముత్తన్న, శీను, శంకర్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: హైదరాబాద్‌లో జింఖానా గ్రౌండ్‌లో వచ్చేనెల 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సింహగర్జన సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు వెంకటస్వామి, ఎల్మల రాజేశ్వర్, పురుషోత్తం, రొడ్డ గంగన్న, కొంతం మురళి, ఈశ్వర్, ముత్తన్న, సుధాకర్ తదితరులు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ.. డిసెంబర్ 1న హైదరాబాద్ లోని జింఖానా మైదానంలో ఏర్పాటు చేసే మాలల సింహమహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ జిల్లా కన్వీనర్ భక్తుల రంజిత్ అన్నారు. శుక్రవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అంతకుముందు మహాగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. ఇందులో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ సభ్యులు ఉన్నారు.



నిర్మల్‌లో పోస్టర్ ఆవిష్కరణలో సభ్యులు



సారంగపూర్ : ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యార్థినులు ప్రణాళికతో చదవాలి

ముథోల్: విద్యార్థినులు క్రమశిక్షణతో మెలుగుతూ పట్టుదల, ప్రణాళికతో చదవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఇంపాక్ట్ ట్రైనర్ వాడేకర్ లక్ష్మణ్ అన్నారు. మండలకేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ గురువులు, తల్లిదండ్రుల పేర్లను నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్పీకర్ సచిన్, ఎస్‌వో ఫర్హాత్ తదితరులు ఉన్నారు.



కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న వాడేకర్ లక్ష్మణ్

‘గిరిజనులతో రాజకీయాలు’

ఖానాపూర్: లగచర్ల ఘటనలో గిరిజనులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో గిరిజనుల సమస్యలను పట్టించుకోకుండా.. ఇప్పుడు కపట ప్రేమ చూపిస్తుందన్నారు. లగచర్ల ఘటనలో బంజారా బిడ్డలను ముందుంచి ప్రచారం చేయడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన భోజనం అందించండి



కుభీర్ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు



సోన్ : లెఫ్ట్ పోచంపాడ్‌లో బియ్యం నాణ్యత పరిశీలిస్తున్న ఎంఈఓ పరమేశ్వర్

కుభీర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఎల్‌పీవో బనావత్ సుధాకర్ పటేల్ అన్నారు. శుక్రవారం కుభీర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను డీఎల్‌పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయుడు చిన్నన్న, ఈవో రాజేశ్వర్, ఉపాధ్యాయులు భూమేశ్ తదితరులు ఉన్నారు.

సోన్: విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ తొడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. మండలంలోని లెఫ్ట్ పోచంపాడు సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలను శుక్రవారం ఎంఈవో పరిశీలించి మాట్లాడారు. వంటగది, భోజనశాల, మూత్రశాలలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు నిర్వహించే నాస్, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష సన్నద్ధత, పద్ధతులను గమనించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాక్‌పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, లోకల్‌వెల్మల్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్వేత, సూపరింటెండెంట్, శ్రీనివాస్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బీమా చేయించుకోవాలి

ఖానాపూర్: 18 ఏళ్లు దాటిన వారంతా విధిగా బీమా చేయించుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో పలు బ్యాంకుల సిబ్బందితోపాటు మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాముకాటు, రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే రూ.రెండు లక్షలు అందించే జన సురక్ష బీమా లో రూ.20 చెల్లించి చేరాలన్నారు. పీఎంజేబీవై బీమా పథకం ద్వారా రూ.436 చెల్లిస్తే సాధారణ మరణాలకు రూ.2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. అటల్ పెన్షన్ గురించి వివరించారు. బ్యాంక్ అధికారులు, మెప్మా సిబ్బంది లక్ష్యం మేరకు రుణాలను రికవరీ చేసి కొత్త వ్యాపారాలకు రుణాలు ఇప్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు హరీశ్, రవీందర్, సంతోష్, మెప్మా సీవో రవీందర్, సిబ్బంది స్రవంతి, శారద తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎల్‌డీఎం రాంగోపాల్

‘దళితులను విభజిస్తున్న పాలకులు’

ఖానాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దళితులను రిజర్వేషన్ల పేరిట విభజిస్తున్నారని మాల మహానాడు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను పెంచాలని కోరారు. సమావేశంలో మేసు చిన్నరాజన్న, మగ్గిడి నారాయణ, మద్దెల భూమన్న, రాజన్న, గంగన్న, చిన్నయ్య, శంకర్, రాజేశ్వర్, శ్యాం, పెద్దులు, సతీశ్, సురేశ్, శ్రీహరి, గంగాధర్, సుమన్, దామోదర్ ఉన్నారు.



జెండావిష్కరణలో పాల్గొన్న నాయకులు

ప్రమాదకర తీగలు సరిచేయరూ..



కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో బొప్పారం భోజన్న అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. పనులు చేసేటప్పుడు తగలకుండా తీగలకు ఓ కర్రను ఏర్పాటు చేశారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.



కర్ర సాయంతో విద్యుత్ తీగలు

చెక్కులు అందజేత

భైంసాటౌన్: పట్టణానికి చెందిన రాజశేఖర్‌కు రూ. 19, 500, లింగురాంనకు రూ.24వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. శుక్రవారం ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ ఎస్ఎస్ కాటన్ లోని తన నివాసంలో లబ్ధిదారులకు చెక్కులు అందించారు.